సాక్షి కామారెడ్డి

శుక్రవారం | 3 | ఫిబ్రవరి | 2023



కండక్టర్, డ్రైవర్ నిజాయితీ

ఆర్టీసీ బస్సులో ఓ మహిళ బంగారం ఉన్న పర్సును పోగొట్టుకోగా కండక్టర్, డ్రైవర్ తిరిగి ఇచ్చి నిజాయితీ చాటుకున్నారు.

- 8లో ▸



కరెంటు బిల్లు కట్టాల్సిందే!

సెలూన్లు, లాండ్రీ షాపులకు సంబంధించిన సబ్సిడీ కరెంటు బిల్లుల డబ్బులను ప్రభుత్వం రెండు నెలలుగా విడుదల చేయడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
30.1 /17.5

వాతావరణం

పొగ మంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృత మవుతుంది. చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

బంగారం మరింత ప్రియం!

- 10 గ్రాములకు రూ. 59,250



సాక్షి, కామారెడ్డి: బంగారం ధరలు రోజుకో రికార్డు సృష్టిస్తున్నాయి. మొన్నటి వరకు 10 గ్రాముల ధర రూ. 58వేల లోపు ఉన్న బంగారం గురువారం రూ. 59,250కి చేరింది. గత వారం, పది రోజుల్లో దాదాపు రూ. రెండు వేలు పెరిగింది. ఇటీవల కాలంలో బంగారం ధరలు పెరుగుతూ వచ్చాయి. కేంద్ర బడ్జెట్ తర్వాత బంగారం ధరలకు మరింత రెక్కలొచ్చాయి. ఎన్నడూ లేనంతగా బంగారం ధరలు పరుగులు తీస్తుండడంతో సామాన్యుడు బెంబేలెత్తిపోతున్నాడు. మరింత పెరుగుతుందని బులియన్ వ్యాపారులు అంటున్నారు.

ఉచిత బియ్యం 5 కిలోలే..

- 5 నుంచి పంపిణీ ప్రారంభం

కామారెడ్డి రూరల్: రేషన్ షాపుల ద్వారా నిరుపేదలకు అందించే ఉచిత బియ్యం ఫిబ్రవరిలో ఒక్కొక్కరికి 5 కిలోలు, అంత్యోదయ కార్డులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డులకు 10 కిలోల చొప్పున ఉచితంగా అందించనున్నారు. ఈ నెల 5 నుంచి పంపిణీ ప్రారంభించనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 2020 మార్చి నుంచి 2022 డిసెంబర్ వరకు ఒక్కొక్కరికి 10 కిలోల చొప్పున రేషన్ షాపుల ద్వారా ఉచితంగా బియ్యం పంపిణీ చేశారు. అయితే ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజనను కేంద్ర ప్రభుత్వం 2023 డిసెంబర్ వరకు పొడిగించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా కేంద్రం తన వంతుగా ఒక్కో యూనిట్‌కు 5కిలోలు యథావిధిగా సరఫరా చేయనుంది. కానీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంతో ఈ నెల ఒక్కొక్కరికి 5 కిలోల చొప్పునే అందించనున్నారు.

నేటి నుంచి హార్డ్ కాపీల స్వీకరణ

కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయుల పదోన్నతుల, బదిలీ ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈనెల 1న దరఖాస్తు గడువు ముగిసింది. మొత్తం 2,574 మంది వెబ్‌సైట్‌లో బదిలీల కోసం అప్లై చేసుకున్నారు. ఇందులో 408 మంది వివరాలు సవరించి మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తుల హార్డ్ కాపీలను ఇది వరకే స్థానిక మండల విద్యాశాఖ అధికారికి టీచర్లు అందజేశారు. ఈ హార్డ్ కాపీలను నేటి నుంచి 6వ తేదీ వరకు డీఈవో కార్యాలయంలో సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకోసం డీఈవో కార్యాలయంలో ఆరు ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు. ఈ ధ్రువపత్రాలను పరిశీలన చేసి ఆన్‌లైన్‌లో ఆమోదిస్తారు. ఈనెల 7న డీఈవో, ఆర్జేడీ వెబ్‌సైట్లలో బదిలీల పాయింట్లతో ప్రొవిజనల్ సీనియారిటీ జాబితా, పదోన్నతుల సీనియారిటీ జాబితాను వెల్లడిస్తారు. మళ్లీ మరుసటి రోజు నుంచి అభ్యంతరాలను స్వీకరిస్తారు. తుది జాబితా తర్వాత గ్రేడ్-2 హెచ్‌ఎంల బదిలీలకు వెబ్‌సైట్ ఆప్షన్ల ఎంపిక ఫిబ్రవరి 11, 12 తేదీల్లో బదిలీలు చేస్తారు.


5,691 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో గురువారం 5,691 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరం ఉన్న 876 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. 44 శిబిరాల్లో పరీక్షలు చేశారు. దీంతో జిల్లాలో ఇప్పటి వరకు 402 శిబిరాలను నిర్వహించి 49,442 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 9,983 మందికి అద్దాలను పంపిణీ చేశారు. పట్టణాలు, గ్రామాల్లో చేపడుతున్న కంటి వెలుగు శిబిరాలకు స్థానిక ప్రజలు వచ్చి పరీక్షలు చేయించుకోవాలని డీఎంహెచ్‌వో డాక్టర్ లక్ష్మణ్ సింగ్ కోరారు.

స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ



సాక్షి, కామారెడ్డి: తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్ నూతన సంవత్సర డైరీని టీఎస్‌ఎన్పీడీసీఎల్ జిల్లా సూపరింటెండెంట్ ఇంజినీర్ రమేశ్‌బాబు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు సంస్థ అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు నందకుమార్, లక్ష్మీనర్సింహ, శిరీష్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.



మనోళ్లదే హవా..

- నేటి నుంచి బడ్జెట్ సమావేశాలు
- స్పీకర్ పోచారం అధ్యక్షతన నిర్వహణ
- మండలిలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- విప్ హోదాలో గంప గోవర్ధన్, ప్యానెల్ స్పీకర్‌గా హన్మంత్ సింధే

సాక్షి, కామారెడ్డి: తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అసెంబ్లీలో మనోళ్ల హవా కొనసాగుతోంది. అసెంబ్లీ స్పీకర్ హోదాలో సీనియర్ నాయకుడు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి గడిచిన నాలుగేళ్లుగా తనదైన శైలిలో సభను నడుపుతున్నారు. అలాగే శాసనసభ వ్యవహారాల మంత్రి హోదాలో వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నీ తానై వ్యవహరించడమే గాకుండా శాసన మండలిలో ఏటా రాష్ట్ర బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ వస్తున్నారు. శాసనసభలో ప్రభుత్వ విప్‌గా కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ వరుసగా రెండో సారి కొనసాగుతున్నారు. జుక్కల్ ఎమ్మెల్యే హన్మంత్‌సింధే ప్యానెల్ స్పీకర్ హోదాలో అవకాశం వచ్చినపుడు అసెంబ్లీకి అధ్యక్షత వహిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు జరిగిన ప్రతీసారి ఉమ్మడి జిల్లాకు చెందిన పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డితో పాటు గంప గోవర్ధన్, హన్మంత్‌సింధేలు తమ పాత్రను పోషిస్తున్నారు. నేటి నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో 'సాక్షి' ప్రత్యేక కథనం..

ప్రశాంత్‌రెడ్డి కీలక భూమిక

ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర మంత్రి వర్గంలో కీలకంగా వ్యవహరిస్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డి అసెంబ్లీ సమావేశాల్లో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. శాసనసభ వ్యవహారాల మంత్రి హోదాలో అసెంబ్లీ సమావేశాల నిర్వహణలో ఆయనది కీలకపాత్ర. అంతేగాక అసెంబ్లీతో పాటు మండలిలోనూ ఏకకాలంలో బడ్జెట్ ప్రవేశపెట్టాలనే సీఎం కేసీఆర్ నిర్ణయంతో గత నాలుగేళ్లుగా శాసన మండలిలో మంత్రి ప్రశాంత్‌రెడ్డి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. ఈ సారి కూడా బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ బాధ్యలన్నీ ఆయనే మోస్తున్నారు.

గత సమావేశాల్లో అవకాశం

జుక్కల్ శాసన సభ్యుడు హన్మంత్ సింధే ప్యానెల్ స్పీకర్‌గా అప్పుడప్పుడు అధ్యక్షత వహించే అవకాశం లభిస్తుంది. స్పీకర్, డిప్యూటీ స్పీకర్‌లు అందుబాటులో లేని సమయంలో కొంతసేపు ప్యానెల్ స్పీకర్ హోదాలో స్పీకర్ స్థానంలో కూర్చుని సమావేశం నిర్వహించాల్సి ఉంటుంది. గత సమావేశాల్లో ఆయన కొంత సేపు సమావేశాలు నిర్వహించారు.

పోచారం అధ్యక్షతన..

ఉమ్మడి జిల్లాలో సీనియర్ రాజకీయ నేతగా ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి నాలుగు దశాబ్దాలుగా అనేక పదవులు అధిష్ఠించారు. టీడీపీ ప్రభుత్వంలో, టీఆర్‌ఎస్ తొలి ప్రభుత్వంలో ఆయన మంత్రిగా కీలకమైన శాఖలు నిర్వహించారు. సీనియర్ సభ్యుడిగా అనేక అనుభవాలు ఉన్న పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సీఎం కేసీఆర్ అసెంబ్లీ స్పీకర్‌గా ప్రతిపాదించారు. దీంతో 2019 జనవరి 9 నుంచి ఆయన అసెంబ్లీ స్పీకర్‌గా పనిచేస్తున్నారు. నాలుగేళ్లలో శాసనసభ సమావేశాలు, బడ్జెట్ సమావేశాలన్నింటిలోనూ ఆయన స్పీకర్ హోదాలో అసెంబ్లీని సమర్థవంతంగా నిర్వహిస్తూ వచ్చారు. ఈ సారి బడ్జెట్ సమావేశాలకు కూడా ఆయన అధ్యక్షత వహించనున్నారు.

రెండు సార్లు ప్రభుత్వ విప్‌గా..

కామారెడ్డి ఎమ్మెల్యే గంప గోవర్ధన్ ప్రభుత్వ విప్ హోదాలో తన వంతు బాధ్యతను నిర్వహిస్తున్నారు. సాధారణంగా చీఫ్ విప్, విప్‌లు అసెంబ్లీలో ప్రవేశపెట్టే బిల్లులు నెగ్గే విషయంలో తమ పార్టీకి చెందిన సభ్యులను సమన్వయం చేసే బాధ్యత నిర్వహిస్తారు. అలాగే సభ్యులు సమావేశాలకు హాజరయ్యేలా ఫాలోఅప్ చేయాల్సి ఉంటుంది. రాజ్యసభ సభ్యుల ఎన్నిక, శాసన మండలి సభ్యుల ఎన్నిక సమయంలో కూడా విప్‌ల పాత్ర కీలకంగా ఉంటుంది.

ఎల్లారెడ్డి బల్దియాలో ముసలం!

- అధికార పార్టీ కౌన్సిలర్ల తిరుగుబాటు
- క్యాంపులో ఏడుగురు!

సాక్షి, కామారెడ్డి: ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో ముసలం పుట్టింది. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు తిరుగుబాటు జెండా ఎగరేశారు. కొందరు సభ్యులు, వారి కుటుంబ సభ్యులు విహారయాత్ర పేరుతో క్యాంపునకు వెళ్లారు. దీంతో ఎల్లారెడ్డి మున్సిపల్ వ్యవహారం హాట్ టాపిక్‌గా మారింది. వివరాల్లోకి వెళితే.. గతంలో మేజర్ పంచాయతీగా ఉన్న ఎల్లారెడ్డి పట్టణాన్ని 12 వార్డులతో మున్సిపాలిటీగా ఏర్పాటు చేశారు. 2020 జనవరిలో జరిగిన ఎన్నికల్లో తొమ్మిది వార్డుల్లో టీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, మూడు వార్డుల్లో కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలుపొందారు. చైర్మన్‌గా కుడుముల సత్యనారాయణ, వైస్ చైర్మన్‌గా ముస్త్యాల సుజాత ఎన్నికయ్యారు. అయితే చైర్మన్, వైస్ చైర్మన్ పదవుల కోసం ప్రయత్నించిన పద్మ శ్రీకాంత్, నునుగొండ భూదేవిలు అప్పటి నుంచి అసంతృప్తితోనే ఉన్నారు. అయితే మున్సిపల్‌లో కొంత కాలంగా ఆధిపత్య పోరు కొనసాగుతోంది. ఇదే సమయంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, ఎమ్మెల్యే సురేందర్‌కు మధ్య విభేదాలు తలెత్తాయి. తర్వాత సర్దుబాటు జరిగినట్లు ప్రచారం జరిగింది. అయితే సమయం కోసం వేచిచూస్తున్న అసంతృప్త కౌన్సిలర్లు మూడేళ్లు పూర్తవడంతో అవిశ్వాసానికి పావులు కదుపుతున్నారు.

అవిశ్వాసం కోసమే క్యాంపునకు..!

ఎల్లారెడ్డి మున్సిపల్‌లో అవిశ్వాసం లొల్లి మొదలైంది. అధికార పార్టీకి చెందిన కౌన్సిలర్లు అల్లం శ్రీనివాస్, పద్మ శ్రీకాంత్, జంగం నీలకంఠంతో పాటు నునుగొండ భూదేవి భర్త శ్రీనివాస్, గాదె విజయలక్ష్మి భర్త తిరుపతి, మంచిర్యాల మహేశ్వరీ భర్త విద్యాసాగర్, సంగని బాలమణి భర్త పోచయ్యలు క్యాంపునకు తరలివెళ్లారు. వారంతా వేరే రాష్ట్రంలో ఉన్నట్లు తెలుస్తోంది.

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం పెట్టాలంటే 12 మంది సభ్యులకు గాను ఎనిమిది మంది బలం అవసరమవుతుంది. క్యాంపులో ఏడుగురు ఉన్నారు. వారు అవిశ్వాసం పెట్టేందుకు రెడీ అయి మిగతా ఐదుగురిలో ఒకరి మద్దతు ఉందని చెప్పుకుంటున్నట్లు తెలుస్తోంది. వారి ప్రయత్నాలు ఏమేరకు ఫలిస్తాయో చూడాలి.

వేడెక్కిన రాజకీయం

ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిలర్లు క్యాంపునకు తరలివెళ్లడంతో రాజకీయం వేడెక్కింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడానికి ఉవ్విళ్లూరుతున్న వివిధ పార్టీల నాయకులు పోటాపోటీ కార్యక్రమాలు నిర్వహిస్తుండడంతో అందరి దృష్టి ఎల్లారెడ్డిపైనే ఉంది. ఇదే సమయంలో ఎల్లారెడ్డి మున్సిపల్ కౌన్సిల్‌లో ముసలం మరింత కాకపుట్టిస్తోంది. అధికార పార్టీని దెబ్బకొట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు ఏ అవకాశాన్ని వదులుకోకుండా పావులు కదుపుతున్నాయి. దీంతో ఎల్లారెడ్డి రాజకీయం మరింత రంజుగా మారింది.



విహార యాత్రలో ఉన్న కౌన్సిలర్లు, నలుగురు మహిళా కౌన్సిలర్ల భర్తలు

సీసీ రోడ్ల నిర్మాణానికి రూ. 17.20కోట్లు

- ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్

సాక్షి, కామారెడ్డి: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా మట్టి రోడ్లను సీసీ రోడ్లుగా అభివృద్ధి చేయడానికి నియోజకవర్గంలో 98 రోడ్లకు రూ. 17.20 కోట్లు మంజూరైనట్లు ప్రభుత్వ విప్ గంప గోవర్ధన్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. కామారెడ్డి మండలంలో 14 పనులకు రూ. 2.05 కోట్లు, దోమకొండ మండలంలో 9 పనులకు రూ. 2.20 కోట్లు, బీబీపేట మండలంలో 10 పనులకు రూ. 2.75 కోట్లు, భిక్కనూరు మండలంలో 18 పనులకు రూ. 3.60 కోట్లు, రాజంపేట మండలంలో ఆరు పనులకు రూ. 85 లక్షలు, మాచారెడ్డి మండలంలో 33 పనులకు రూ. 4.70 కోట్లు, కామారెడ్డి మండలంలో ఎనిమిది పనులకు రూ. కోటి 05లక్షలు మంజూరైనట్లు వివరించారు. రోడ్ల నిర్మాణ పనులను త్వరితగతిన చేపట్టి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

క్షతగాత్రులకు సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి

సదాశివనగర్(ఎల్లారెడ్డి): ప్రమాదాలకు గురైన వారికి అతిత్వరగా సేవలందిస్తే వారి ప్రాణాలను రక్షించిన వాళ్లవుతామని ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు మొదటి గంటలో అందించే సేవలు చాలా ముఖ్యమన్నారు. అందుకే ప్రమాదం జరిగిన తర్వాత ఒక గంట సమయాన్ని గోల్డెన్ అవర్‌గా పిలువబడుతుందని పేర్కొన్నారు. గురువారం మండలంలోని మర్కల్ స్టేజీ వద్ద గల అశోక్ గార్డెన్స్‌లో నిర్వహించిన యాక్సిడెంట్ ఫస్ట్ రెస్పాండర్స్ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. ప్రమాదాలకు గురైన వారికి అతి ముఖ్యమైన సేవలను త్వరగా అందించి బాధితుల ప్రాణాలకు ముప్పువాటిల్లకుండా కాపాడవచ్చని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించారు. రహదారులపై వాహనాలు నడిపే డ్రైవర్లు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. నియమాలను అతిక్రమించిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి హాజరైన పోలీస్ సిబ్బందికి, పెట్రోల్ పంపుల ఉద్యోగులకు, ఎన్‌హెచ్‌ఏఐ ఉద్యోగులకు, విద్యార్థులకు, ఆటోడ్రైవర్లకు, హోటల్ యజమానులకు, ప్రోత్సాహక సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ అన్యోన్య, ఆర్డీవో వాణి, డీఎస్పీ ఉదయ్‌కృష్ణ, ఎంవీఐ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ రామన్, ఎస్సై తోట రాజేశ్, ఏఎస్సైలు పాల్గొన్నారు.

నేడు డ్వాక్రా మహిళలతో మహా ర్యాలీ

- బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహణ

కామారెడ్డి టౌన్: బీజేపీ కామారెడ్డి అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకట రమణారెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న 'మరోమారు మహిళ పోరు' ఉద్యమంలో భాగంగా నేడు జిల్లా కేంద్రంలో డ్వాక్రా మహిళలతో మహా ర్యాలీ నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం బకాయిపడ్డ స్త్రీనిధి, వడ్డీ లేని రుణాలకు సంబంధించిన నిధులు, అభయహస్తం పథకం పునరుద్ధరించాలనే డిమాండ్లతో కార్యక్రమం చేపట్టనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు సుమారు 25వేల మంది మహిళలతో గాంధీ గంజ్ నుంచి ర్యాలీ ప్రారంభించనున్నారు. అక్కడి నుంచి సిరిసిల్ల రోడ్డు, స్టేషన్ రోడ్‌ల మీదుగా నిజాంసాగర్ చౌరస్తాకు చేరుకుని రాస్తారోకో నిర్వహించనున్నారు. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వెంకట రమణారెడ్డి కోరారు.

మూలనపడ్డ ఎక్స్‌రే మిషన్

- జిల్లా కేంద్ర ఆస్పత్రిలో నెల రోజులుగా పనిచేయని వైనం
- ప్రైవేటు సెంటర్లకు వెళ్తున్న పేదలు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి ప్రభుత్వ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో ఎక్స్‌రే యంత్రం చెడిపోయింది. జనవరి 5వ తేదీ నుంచి యంత్రం పనిచేయకపోవడంతో ఆస్పత్రికి వచ్చే పేదలు ఇబ్బందులు పడుతున్నారు. విధిలేక ప్రైవేటు ఎక్స్‌రే సెంటర్లకు వెళ్లి డబ్బులు వెచ్చిస్తున్నారు. నెల రోజులుగా యంత్రానికి మరమ్మతులు చేయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఆస్పత్రికి ఆర్థోపెడిక్, జనరల్ ఇతర రోగులు ఎక్స్‌రే సేవలు లేకపోవడం వల్ల బయట ప్రైవేటు సెంటర్లలో వందల రూపాయలు వెచ్చించి ఎక్స్‌రే తీయించుకుంటున్నారు. మూడు రోజుల క్రితం టెక్నీషియన్ వచ్చి పరిశీలించినా మరమ్మతులు కాలేదు. మళ్లీ టెక్నీషియన్‌ను తెప్పించడానికి ఆస్పత్రి అధికారులు ప్రయత్నాలు సాగిస్తున్నారు. ఆస్పత్రిలో 150 నుంచి 200 వరకు ఎక్స్‌రే సేవలు ఉచితంగా ఆస్పత్రిలో సేవలందుతాయి. ఆస్పత్రిలో ఎక్స్‌రే సేవలు నిలిచిపోవడంతో ప్రైవేటు సెంటర్లకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఎక్స్‌రే సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అయితే ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మిని 'సాక్షి' సంప్రదించగా ఎక్స్‌రే మిషన్ చెడిపోయిందని.. స్థానికంగా టెక్నీషియన్‌లు అందుబాటులో ఉండరని పేర్కొన్నారు. యంత్రాల కంపెనీల నుంచి టెక్నీషియన్ వస్తారని చెప్పారు. మరమ్మతులు చేయించడానికి ప్రయత్నిస్తున్నామని తెలిపారు.



చెడిపోయిన ఎక్స్‌రే యంత్రం

బర్ధిపూర్ పంప్‌హౌస్ ట్రాన్స్‌ఫార్మర్ దగ్ధం

డిచ్‌పల్లి : నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ కు సంబంధించిన 2 ఎంవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌లో గురువారం మంటలు చెలరేగి దగ్ధం అయింది. రైతులు, విద్యుత్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం ఉదయం అకస్మాత్తుగా వచ్చిన ఈదురు గాలికి విద్యుత్ వైర్లు ఒకదానికొకటి తగిలి ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు అంటుకున్నాయి. సమాచారం అందుకున్న ఫైరింజన్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పడానికి యత్నించినా సాధ్యం కాలేదు. ట్రాన్స్‌ఫార్మర్‌లో ఉండే ఆయిల్ వల్ల నీళ్లు పోస్తే మరింతగా మంటలు రావడంతో ఫైరింజన్ సిబ్బంది నీళ్లు చల్లడం నిలిపి వేశారు. ఆయిల్ మొత్తం కాలిపోయిన తర్వాత మంటలు ఆగిపోయాయి. ఘటనా స్థలానికి జిల్లా విద్యుత్ శాఖ ఎస్‌ఈ రవీందర్, అధికారులు ఉత్తమ్, రాజేశ్వర్, బాలేష్, రాజేందర్, ఇరిగేషన్ అధికారులు గంగాధర్, శ్రీచంద్, కిరణ్‌లు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆయకట్టు రైతుల నేతృత్వంలోనే పంప్‌హౌస్, ట్రాన్స్‌ఫార్మర్ నిర్వహణ కొనసాగుతోంది. గతంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేయగా ఆయకట్టు రైతుల వినతి మేరకు రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను మంజూరు చేయించారు. గత ఏడాది మార్చిలో పంప్‌హౌస్ వద్ద కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించారు. దీంతో ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ ద్వారా ఆయకట్టు గ్రామాల చెరువులకు నీళ్లు సరఫరా అయ్యాయి. ఇప్పుడు ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో ఆయకట్టు గ్రామాల పంటలకు ఇబ్బందులు ఎదురవుతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఎగసిపడుతున్న మంటలు

కలకలం రేపిన విద్యార్థి మృతి

- మైనారిటీ గురుకుల పాఠశాలలో ఘటన
- గతంలోనూ విద్యార్థుల మధ్య పరస్పర దాడులు
- లోపించిన అధికారులు, సిబ్బంది పర్యవేక్షణ

నిజామాబాద్ అర్బన్: డిచ్‌పల్లి మండలం బర్ధిపూర్ శివారులోని తెలంగాణ మైనారిటీ గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణలో తొమ్మిదో తరగతి విద్యార్థి షేక్ సోఫియాన్ (14) మృతి చెందడం తీవ్ర కలకలం రేపింది. అధికారుల పర్యవేక్షణ లోపమే ఘటనకు కారణమని తెలుస్తోంది. ఈ గురుకులంలో గతంలోనూ విద్యార్థుల మధ్య పరస్పర దాడులు జరిగాయి. ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకపోవడం వల్లే గురువారం జరిగిన ఘటనలో విద్యార్థి ప్రాణాలు కోల్పోయాడని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. తాజాగా జరిగిన ఘటన నేపథ్యంలో విచారణ జరిపిన అధికారులు కొన్ని రోజులుగా వార్డెన్ అందుబాటులో లేడని తేల్చారు. అయితే వార్డెన్ రిజిష్టర్‌లో మాత్రం సంతకాలు చేయడాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నారు. మైనార్టీ గురుకుల పాఠశాలను మొదట జక్రాన్‌పల్లి మండలం మునిపల్లి వద్ద ఓ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించారు. గతంలో పదో తరగతి 'ఎ' సెక్షన్ విద్యార్థులు, 'బి' సెక్షన్ విద్యార్థుల మధ్య వరుసగా రెండు రోజులపాటు పరస్పర దాడులు జరిగాయి. ఒకరినొకరు తీవ్రంగా కొట్టుకున్నారు. చాలామంది విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన అప్పట్లో కలకలం రేపింది. విద్యార్థుల తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు అడిషనల్ కలెక్టర్ చంద్రశేఖర్ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విచారణ జరిపారు. కొందరు సిబ్బందిపై చర్యలు తీసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి బర్ధిపూర్ శివారులోని ఓ జూనియర్ కళాశాల భవనంలోకి మైనారిటీ గురుకుల పాఠశాలను మార్చారు. ఇక్కడ మళ్లీ మధ్యాహ్న భోజన సమయంలో బెంచీపై కూర్చునే విషయంలో ఇద్దరు విద్యార్థుల మధ్యవివాదం చెలరేగి జరిగిన ఘర్షణలో నగరంలోని గౌతంనగర్‌కు చెందిన షేక్ సోఫియాన్ మృతి చెందాడు. గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్‌తో ఉపాధ్యాయులు, సిబ్బంది సరైన సమయానికి రావడం లేదని, దీంతో విద్యార్థులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది.



నిజామాబాద్ జీజీహెచ్‌లో బంధువుల ఆందోళన

సోఫియాన్ మృతదేహం

ప్రిన్సిపల్, వార్డెన్ తొలగింపు

మైనారిటీ గురుకుల పాఠశాలలో విద్యార్థి మృతితో అవుట్ సోర్సింగ్ పద్ధతిన కొనసాగుతున్న ప్రిన్సిపల్ జలీల్‌అహ్మద్, వార్డెన్ జఫీరొద్దీన్‌ను ఉద్యోగం నుంచి తొలగిస్తూ మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి రతన్ ఉత్తర్వులు జారీ చేశారు. విద్యార్థి మృతి ఘటనపై కలెక్టర్ విచారణ చేపట్టారు.

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: రాష్ట్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల ప్రతిభా జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని టీఎస్‌డబ్ల్యూ, టీటీడబ్ల్యూ గురుకుల కళాశాలల ప్రాంతీయ సమన్వయకర్త టి సంపత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న వారిని ప్రవేశ పరీక్షలో పొందిన మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 5లోపు, జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలకు 17లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. జూనియర్ కళాశాలల ప్రవేశాలకు సంబంధించి వివరాల కోసం 9121174434 నంబర్‌కు, డిగ్రీ కాలేజీలో ప్రవేశాలకు కామారెడ్డి జిల్లాకు చెందిన వారు 7901097707, నిజామాబాద్‌కు చెందిన వారు 7901097710 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

ఓయూ ఆడిట్ సెల్ డైరెక్టర్‌కు సన్మానం



భిక్కనూరు: ఉస్మానియా యూనివర్సిటీ ఆడిట్ సెల్ డైరెక్టర్‌గా నియమితులైన ప్రొఫెసర్ నగేష్‌ను సౌత్ క్యాంపస్ జియో ఇన్ఫర్మేటిక్స్ విభాగం అధ్యాపకులు సన్మానించారు. గురువారం ఓయూలో ఆయనను కలిసి శాలువా, మెమెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌వోడీ ఆర్ సుధాకర్‌గౌడ్, ప్రొఫెసర్లు టి ప్రతిజ్ఞ, ఎస్ నారాయణ పాల్గొన్నారు.

పాఠశాలను పరిశీలించిన జడ్జి



ఖలీల్‌వాడి: మాక్లూర్ మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ పాఠశాలను సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి పద్మావతి గురువారం పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ప్రిన్సిపాల్ పద్మజ తదితరులు ఉన్నారు.

అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణ



ఖలీల్‌వాడి: బస్సు ప్రమాదాలు నివారణకు ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లకు శిక్షణను ఆర్ఎం ఉషాదేవి గురువారం ప్రారంభించారు. నగరంలోని ఆర్ఎం ఆఫీసులోని ట్రైనింగ్ హాల్‌లో ఏర్పాటు చేసిన శిబిరంలో ఆమె మాట్లాడారు. హైర్ బస్ డ్రైవర్లకు రోడ్డు ప్రమాదాలు నివారించే విధానాలు నేర్పడానికి ఆర్టీసీ మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తుందని తెలిపారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ డ్రైవర్లకు పలు సూచనలు చేశారు. రూల్స్ పాటించడంతో ఎలాంటి ప్రమాదాలకు ఆస్కారం ఉండదన్నారు. ఉత్తమ ప్రమాద రహిత డ్రైవర్ లక్ష్మణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నగర ట్రాఫిక్ సీఐ చందర్‌రాథోడ్, డిప్యూటీ ఆర్ఎం శంకర్, డీఎం ఆనంద్ తదితరులు ఉన్నారు.

ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



కామారెడ్డి టౌన్: డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని కామారెడ్డి ఎంవీఐ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. గురువారం డిపో కార్యాలయంలో బస్సు డ్రైవర్లకు ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమం ఆయన పాల్గొన్నారు. ప్రమాద రహిత సంస్థగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ డీఎం లక్కు మల్లేషం తదితరులు పాల్గొన్నారు.

కరెంటు బిల్లు కట్టాల్సిందే!

- రెండు నెలలుగా సబ్సిడీ విడుదల చేయని ప్రభుత్వం
- సెలూన్లు, లాండ్రీషాపుల నిర్వాహకులపై విద్యుత్ సిబ్బంది ఒత్తిడి

బాన్సువాడరూరల్: బీసీల్లో అత్యంత వెనుకబడిన కులవృత్తిదారులకు శారీరక శ్రమను తగ్గించి, ఆర్థిక వెసులుబాటు కల్పించాలనే ఉద్దేశంతో రజకులు, నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం ఉచిత విద్యుత్ సౌకర్యం కల్పించింది. దీనిద్వారా నాయీబ్రాహ్మణులు నిర్వహించే సెలూన్లకు, రజకులు నిర్వహించే లాండ్రీషాపులు, దోబీఘాట్లకు నెలకు 250 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా కులవృత్తిదారులకు ఉచితంగా ఇస్తున్న విద్యుత్‌కు సంబంధించిన సబ్సిడీ డబ్బులను రెండు నెలలుగా ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని సెలూన్లు, లాండ్రీషాపుల నిర్వాహకులపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అంతకుముందు కూడా ఇదేవిధంగా సబ్సిడీ డబ్బులు విడుదల కాకపోవడంతో విద్యుత్ అధికారులు బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో ప్రభుత్వం స్పందించి అక్టోబర్‌లో సబ్సిడీ డబ్బులు విడుదల చేసింది. ఇప్పుడు మళ్లీ సబ్సిడీ డబ్బుల విడుదలలో జాప్యం జరుగుతుండటంతో సెలూన్లు, లాండ్రీషాపులు, దోబీఘాట్ల నిర్వాహకులు ఏం చేయాలో తోచక ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో 2,230మంది లబ్ధిదారులు



నాయీబ్రాహ్మణులు, రజకులకు వృత్తిపరంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నందున వారికి ప్రభుత్వం విద్యుత్ బిల్లులో సబ్సిడీ ఇస్తూ 2021న ఏప్రిల్01న ఉత్తర్వులు విడుదల చేసింది. ప్రతి ఒక్క షాపులో ప్రతి నెలా 250యూనిట్ల వరకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తుంది. దీంతో జిల్లాలో సుమారు 1280మంది నాయీబ్రాహ్మణులు, సుమారు 950మంది రజకులకు లబ్ధి పొందుతున్నట్లు బీసీసంక్షేమశాఖ అధికారులు తెలిపారు. అయితే వీరికి రెండు నెలల నుంచి సబ్సిడీ బిల్లులు అందటం లేదు. నూటికి నూరుశాతం బిల్లులు వసూలు చేయాలని విద్యుత్ అధికారులపై సీఎండీ స్థాయినుంచి ఆదేశాలు రావడంతో క్షేత్రస్థాయి విద్యుత్ సిబ్బంది సెలూన్లు, లాండ్రీషాపులు నిర్వహిస్తున్న యజమానుల వద్దకు వచ్చి కరెంట్ బిల్లులు చెల్లించాలని ఒత్తిడి తెస్తున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పెండింగ్‌లో ఉన్న సబ్సిడీ బిల్లులను విడుదల చేసి ఆదుకోవాలని వారు కోరుతున్నారు.

బిల్లులు కట్టమంటున్నారు..



నా సెలూన్‌కు సంబంధించి రెండు నెలల నుంచి సబ్సిడీ రావడం లేదని విద్యుత్ సిబ్బంది బిల్లులు కట్టమని అంటున్నారు. ప్రభుత్వం 250యూనిట్ల వరకు బిల్లు చెల్లించవద్దని చెబుతున్నా.. అధికారులు మాత్రం మాకు పైనుంచి ఒత్తిడి ఉంది. మీరు చెల్లించాలి అని అంటున్నారు.

– నవీన్, సెలూన్ నిర్వాహకుడు, బోర్లం

ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దు



కరెంట్ బిల్లుల చెల్లింపునకు సంబంధించి ఎలాంటి ఆందోళన చెందవద్దు. సెలూన్లు, లాండ్రీషాపులకు సంబంధించిన లబ్ధిదారులు ఒక్కరూపాయి కూడా విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేదు. ఆలస్యమైనా ప్రభుత్వమే విద్యుత్‌శాఖకు సబ్సిడీ చెల్లిస్తుంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విద్యుత్ అధికారులు డిస్‌కనెక్ట్ చేయరు.

– మాలెపల్లి శివరాం, నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు

హాస్టల్‌లో వసతులపై స్పీకర్ ఆరా



విద్యార్థులతో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం

బాన్సువాడ టౌన్: దేశాయిపేట్‌లో నర్సింగ్ కళాశాల వసతి గృహాన్ని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కల్పిస్తున్న సౌకర్యాలపై ఆరా తీశారు. హాస్టల్‌లో లోవోల్టేజ్ సమస్య ఉందని విద్యార్థులు పేర్కొనడంతో స్పందించిన స్పీకర్ వెంటనే ట్రాన్స్‌కో అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రాక్టికల్ సమయంలో మాత శిశు ఆస్పత్రికి వెళ్లేందుకు హాస్టల్ నుంచి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పిస్తామని స్పీకర్ హామీ ఇచ్చారు. ఆయన వెంట ఆర్డీవో రాజాగౌడ్ ఉన్నారు.

బాన్సువాడ రూరల్: స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గురువారం తన స్వగ్రామమైన పోచారంలో పర్యటించి అక్కడ చేపడుతున్న పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. అభివృద్ధి పనుల కోసం మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ పరిగె రాధ, నాయకులు పోచారం సురేందర్‌రెడ్డి, విజయ్‌గౌడ్, సాయిరెడ్డి, లతీఫ్, కమటాల శ్రీనివాస్‌రెడ్డి, రాజేశ్వర్‌గౌడ్, సయ్యద్ జలీల్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్, డ్రైవర్ నిజాయితీ

- పోగొట్టుకున్న బంగారం బాధితురాలికి అందజేత



మహిళకు బంగారం అందజేస్తున్న సిబ్బంది

కామారెడ్డి టౌన్: ఆర్టీసీ బస్సులో ఓ మహిళ తన పర్సును పోగొట్టుకోగా డ్రైవర్, కండక్టర్‌లు ఆ పర్సును తీసుకుని మరుసటి రోజు బాధితురాలికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భిక్కనూరు మండలం పెద్దమల్లారెడ్డి గ్రామానికి బుద్ధ భాగ్య మంగళవారం సాయంత్రం కామారెడ్డి ఆర్టీసి బస్టాండ్‌లో పెద్దమల్లారెడ్డి బస్సు ఎక్కింది. వారి పిల్లలను తీసుకెళ్లడానికి దోమకొండలో దిగి అక్కడి నుంచి ఆటో ఎక్కి డబ్బుల కోసం చూసుకునే సరికి బస్సులో పర్సు పోగొట్టుకున్నానని గమనించి ఆమె రోదిస్తూ డిపోకు వెళ్లింది. అక్కడి అధికారులు సమాచారం ఇవ్వగా డీఎం లక్కు మల్లేశం బస్సులో విధులు నిర్వహిస్తున్న కండక్టర్ ఏ నరహరి, డ్రైవర్ ఎస్ రాజుకు ఫోన్ చేసి వివరాలు తెలిపారు. బస్సులో ఓ ప్రయాణికుడు తన పర్సు అని వాదించగా అతని వద్ద నుంచి కండక్టర్ పర్సును స్వాధీనం చేసుకున్నారు. పర్సులో ఐదు తులాల పుస్తెల తాడు, నల్లపూసల దండతో పాటు రూ.1500 నగదు ఉంది. రాత్రి డీఎం చాంబర్‌లో సదరు మహిళకు పర్సు, బంగారం గోలుసు, నగదును అందించారు. మహిళ కన్నీళ్లతో ఆర్టీసీ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపింది. అధికారులు కూడా అభినందనలు తెలిపారు.

విద్యార్థిని చితకబాదిన ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం చేపూర్ క్షత్రియ పాఠశాల విద్యార్థి బక్కూరి విరాట్‌ను చితకబాదిన పీఈటీ జయపాల్‌పై విద్యార్థి తండ్రి శ్రీనివాస్ గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మోర్తాడ్ మండలం శెట్‌పల్లి గ్రామానికి చెందిన విరాట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. కాగా విద్యార్థి పాఠశాలకు రాకుండా గ్రామంలో బైక్‌పై తిరుగుతున్నాడని గ్రామానికి చెందిన ఒకరు పాఠశాల ప్రిన్సిపాల్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో మంగళవారం పాఠశాలకు వచ్చిన విద్యార్థిని ప్రిన్సిపాల్ ఆదేశాలతో పీఈటీ మందలిస్తూ విచక్షణ రహితంగా దండించాడు. విద్యార్థిని వెన్ను, తొడలపై తీవ్ర గాయాలు కావడంతో తండ్రి శ్రీనివాస్ ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాఠశాలకు నోటీసులు

క్షత్రియ పాఠశాల కరస్పాండెంట్‌కు ఎంఈవో రాజగంగారం నోటీసులు జారీ చేశారు. విద్యార్థిని విచక్షణ రహితంగా ఎందుకు దండించాల్సి వచ్చిందో వివరణ ఇవ్వాలని నోటీసులో పేర్కొన్నారు.

వృద్ధురాలి అదృశ్యం

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ కాలనీలో నివాసం ఉండే పిల్లి లక్ష్మి(68) అదృశ్యమైనట్లు ఫిర్యాదు వచ్చిందని పట్టణ ఎస్‌హెచ్ నరేష్ గురువారం తెలిపారు. వృద్ధురాలు కనిపించకపోవడంతో చుట్టు పక్కలవారు హైదరాబాదులో ప్రైవేటు ఉద్యోగం చేసే ఆమె కుమారుడు హరిప్రసాద్‌కు ఈ నెల 1న సమాచారం ఇచ్చారు. అతడు కామారెడ్డికి వచ్చి చాలా చోట్ల గాలించాడు. అయినా ఆచూకీ లభించలేదు. దీంతో గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ చోరీ

కామారెడ్డి క్రైం: గుర్తు తెలియని వ్యక్తులు ఓ లారీని అపహరించిన ఘటన కామారెడ్డిలోని ఇందిరానగర్ కాలనీలో గురువారం వెలుగు చూసింది. కాలనీకి చెందిన అబ్దుల్ హకీం తన లారీని ఎప్పటిలాగే బుధవారం రాత్రి ఇంటికి సమీపంలోని మజీద్ రోడ్డు వద్ద పార్క్ చేశాడు.

ఉదయం వెళ్లి చూసేసరికి లారీ కనిపించలేదు. సుమారు 6 గంటల ప్రాంతంలో ఎవరో లారీని స్టార్ట్ చేసినట్లు శబ్దం వినబడిందని దగ్గర్లో నివాసం ఉండేవారు చెబుతున్నారు. చుట్టుపక్కల గాలించినా లారీ ఆచూకీ దొరకలేదు. దీంతో హకీం పట్టణ పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

విద్యార్థిని కొట్టిన ఘటనపై విచారణ



విచారణ జరుపుతున్న డీసీడీవో వనిత

సిరికొండ: సిరికొండలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యార్థిని ప్రిన్సిపాల్ కొట్టిన ఘటనపై డీసీడీవో వనిత గురువారం విచారణ చేశారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న దినేష్‌ను పరీక్ష కోసం సరిగా చదవడం లేదని గత నెల 31న ప్రిన్సిపాల్ సునీత కొట్టింది. ఆ విద్యార్థికి తలపైన, చెవికి గాయాలయ్యాయని తల్లిదండ్రులు డీఈవోకు వాట్సాప్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఈవో విచారణకు డీసీడీవోను పంపించారు. ఆ తరగతిలోని విద్యార్థులను ఉపాధ్యాయులను డీసీడీవో విచారించారు. విచారణలో విద్యార్థిని కొట్టిన విషయం వాస్తవమే అని తెలిసిందని, విచారణ పూర్తి నివేదికను డీఈవోకు అందచేస్తానని ఆమె పేర్కొన్నారు. చదవకుండా అల్లరి చేయడంతోనే పది వరకు విద్యార్థులను కొట్టినట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. అందరి విద్యార్థుల్లానే దినేష్‌ను కొట్టానని, దెబ్బలు తగిలేలా గట్టిగా కొట్టలేదని ప్రిన్సిపాల్ తెలిపారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



రోడ్డును పరిశీలిస్తున్న సీపీ నాగరాజు

ధర్పల్లి: ధర్పల్లిలోని భీమ్‌గల్ రోడ్డులో కోళ్ల ఫామ్ వద్ద ప్రమాదకరంగా మారిన మూల మలుపును సీపీ నాగరాజు గురువారం సాయంత్రం పరిశీలించారు. ఈ మలుపు వద్ద బుధవారం బైకు అదుపు తప్పి పడిపోవడంతో ఇద్దరు మరణించిన విషయం తెలిసిందే. మూలమలుపు వద్ద తరచూ రోడ్డు ప్రమాదాలు జరగడంతో తక్షణమే నివారణ చర్యలు చేపట్టాలని సీపీ ఆర్అండ్‌బీ అధికారులను ఆదేశించారు. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరగకుండా స్పీడ్ బ్రేకర్లతో పాటు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, ఆర్అండ్‌బీ డీఈ సుధీర్, సీఐలు సైదా, శ్రీశైలం, ఎస్సై వంశీకష్ణా అధికారులు ఉన్నారు.

వెంచర్ పనుల నిలిపివేత

ఇందల్వాయి: మండలంలోని గన్నారం గ్రా మంలో శివాలయం శివారులో 1274, 1275 సర్వే నంబర్లలో అసైన్డ్ భూమిలో చేపట్టిన వెంచర్ పనులను గురువారం నిలిపివేసినట్లు తహసీల్దార్ రోజా తెలిపారు. అసైన్డ్ భూమిలో పంటల సాగు కాకుండా నివాసపు ప్లాట్లుగా మార్చేందుకు మొరం పోస్తున్నట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు వెళ్లి తనిఖీ చేశామన్నారు.

క్రైం కార్నర్

ఆటో బోల్తా పడి యువకుడి మృతి



అరవింద్ మృతదేహం

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలోని ఓ వ్యక్తి ఇంట్లో పీవోపీ పనులను చేసేందుకు ట్రాలీ ఆటోలో హైదరాబాద్ నుంచి వస్తుండగా ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడి బీహార్‌కు చెందిన అరవింద్ (27) మృతి చెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలంలోని కొట్టాల్ శివారులో గురువారం చోటు చేసుకుంది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్‌కు చెందిన రామ్, అరవింద్, సోను హైద్రాబాద్ నుంచి కామారెడ్డి మీదుగా ఎల్లారెడ్డికి ట్రాలీ ఆటోలో వస్తుండగా కొట్టాల్ శివారులో ఎదురుగా వస్తున్న బస్సును తప్పించబోయి ఆటోబోల్తా పడింది. ప్రమాదంలో ఆటోడ్రైవర్ రామ్, సోనులకు తీవ్ర గాయాలు కాగా అరవింద్ ఘటన స్థలంలోనే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

గంజాయి రవాణాలో పిట్లం వాసులు



ఖమ్మం జిల్లాలో దొరికిన గంజాయి ప్యాకెట్లు

నిజాంసాగర్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం నుంచి ఎండు గంజాయిని కారులో తరలిస్తూ భద్రాచలం దొరికిన వారిలో జిల్లాకు చెందిన ఇద్దరు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి బిచ్కుంద ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాలు.. ఖమ్మం జిల్లాలోని భద్రాచలం బ్రిడ్జి వద్ద గురువారం వేకువజామున ఎక్సైజ్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. ఒక కారును తనిఖీ చేయగా కారు కింది భాగంలో ఎండు గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు గుర్తించారు. కారులోని ముగ్గురు నిందితుల్లో పిట్లం మండలానికి చెందిన నిఖిల్‌కుమార్, రాందాస్ ఉన్నారు. కారు తనిఖీ చేస్తుండగా అందులో ఉన్న ఇద్దరు పరారు కాగా నిఖిల్‌కుమార్ దొరికారు. 20 కిలోల ఎండుగంజాయి, కారును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

వారం రోజుల్లో కుమారుడి పెళ్లి..

- రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి
- వివాహానికి మేకలు తీసుకురావడానికి వెళ్తుండగా ఘటన



దుర్గయ్య మృతదేహం

ఎల్లారెడ్డిరూరల్: వారం రోజుల్లో కుమారుడి పెళ్లి ఉండగా రోడ్డు ప్రమాదంలో తండ్రి మరణించాడు. వివరాలు.. ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం గ్రామానికి చెందిన పేరు దుర్గయ్య(60) కుమారుడు వెంకట్ వివాహం ఈ నెల 9న జరగాల్సి ఉంది. పెళ్లికి మేకల కోసం దుర్గయ్య తన తమ్ముడు రాములుతో కలిసి గురువారం తెల్లవారుజామున ఎక్సెల్‌పై బాన్సువాడకు బయలు దేరాడు. మండలంలోని బొగ్గుగుడిసె శివారులో గుర్తు తెలియని బైక్ వీరిని ఢీకొనడంతో దుర్గయ్య అక్కడిక్కడే ప్రాణాలు వదిలాడు. ప్రమాదంలో రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. వారం రోజుల్లో పెళ్లి జరగాల్సిన ఇంట్లో తండ్రి మృతి చెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. మృతుడి కుమారుడు వెంకట్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై గణేష్ తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరు..

పిట్లం: పెద్దకొడప్‌గల్ మండలంలోని అంజని గ్రామానికి చెందిన గజ్జల బలరాం గురువారం విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. గజ్జల బలరాం (50) ఉదయం పొలానికి వెళ్లాడు. అక్కడ కరెంట్ షాక్‌తో చనిపోయాడు. అదే గ్రామానికి చెందిన అంజవ్వ చూసి అతని కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. మృతుడికి నాలుగురు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య శ్యామల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై విజయ్ కొండ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని ఆత్మహత్య

మాచారెడ్డి: భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపానికి గురైన ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి భవానీపేట తండాలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. మండలంలోని భవానీపేట తండాకు చెందిన బానోత్ రమేశ్ (35) కు 15 క్రితం అదే గ్రామానికి చెందిన యువతితో వివాహమైంది. వారికి కూతురు, కుమారుడు ఉన్నారు. భార్యాభర్తల మధ్య గొడవలు జరిగి భార్య దూరంగా ఉంటోంది. భార్య కాపురానికి రాకపోవడంతో మరో యువతిని వివాహం చేసుకున్నాడు. రెండో భార్య కూడా గొడవపడి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన రమేశ్ గ్రామానికి సమీపంలోని చెరువులో దూకాడు. సమాచారం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు నుంచి తీసి ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. మృతుడి తల్లి ఫంగి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

అనారోగ్యంతో ఒకరి ఆత్మహత్య

రెంజల్: మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన అంకం రాజేందర్(47) గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై పండ్ల సాయన్న తెలిపారు. వివరాలు.. రాజేందర్ కొంత కాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. బుధవారం రాత్రి ఛాతిలో నొప్పి వస్తుందని చెప్పడంతో రాత్రి 11 గంటల వరకు ఆయనకు భార్య, కుటుంబీకులు సేవలను అందించినట్లు తెలిపారు. గురువారం ఇంట్లో లేకపోవడంతో చట్టుపక్కల గాలిస్తుండగా గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నట్లు గుర్తించిన స్థానికులు భార్యకు సమాచారం అందించారు. మృతుడి భార్య సరిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఎడపల్లిలో ఒకరు..



గంగారాం మృతదేహం

ఎడపల్లి: ఎడపల్లికి చెందిన కాచిగూడ గంగారం(51) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనారోగ్య సమస్యలతో ఎలుకల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య భూదెవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై పాండేరావు తెలిపారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని పంచముఖి హనుమాన్‌కాలనీలో తాళం వేసిన ఓ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. మాచారెడ్డికి చెందిన గంగుల రాములు ప్రైవేటు ఉద్యోగిగా పనిచేస్తూ కొద్ది రోజులుగా కామారెడ్డిలోని పీఎంహెచ్ కాలనీలో అద్దెకు ఉంటున్నాడు. గత నెల ఇంటికి తాళం వేసి కుటుంబంతో కలిసి స్వగ్రామానికి వెళ్లాడు. గురువారం ఉదయం ఇంటి తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించిన చుట్టాపక్కల వారు రాములుకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలాన్ని పట్టణ పోలీసులు పరిశీలించి విచారణ జరిపారు. ఇంట్లోని రెండు తులాల బంగారం, 30 తులాల వెండి ఆభరణాలు, ఒక టీవి చోరీకి గురైనట్లు బాధితులు చెబుతున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.

మరో ఇంట్లో చోరీకి యత్నం

పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో ఓ తాళం వేసిన ఇంట్లో దొంగలు బుధవారం రాత్రి చోరీకి యత్నించారు. తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. విలువైన వస్తువులు చోరీకి గురి కాలేదని పోలీసులు తెలిపారు.

ఆటో బోల్తా : నలుగురికి గాయాలు



ప్రమాదంలో ధ్వంసమైన ఆటో

జక్రాన్‌పల్లి: మండలంలోని అర్గుల్ గ్రామ శివారులోని 44వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆర్మూర్ మండలంలోని మామిడిపల్లి నుంచి ఆటో ముగ్గురు ప్రయాణికులతో కలిసి బయలుదేరి డిచ్‌పల్లి వైపు వెళ్తోంది. ఈ క్రమంలో అర్గుల్ జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ముందటి అద్దాలు పగిలిపోయాయి. ఈ ప్రమాదంలో బాలాగనర్‌కు చెందిన ఆటో డ్రైవర్ రమేష్ అందులో ప్రయాణిస్తున్న సాయమ్మ, చిలుకమ్మతో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆర్మూర్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

లారీని ఢీకొని డాక్టర్‌కు గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో విధులు నిర్వర్తించే డాక్టర్ విష్ణు గురువారం ఉదయం లారీని ఢీకొని గాయపడ్డాడు. టీ తాగేందుకు వెళ్లి వస్తుండగా బస్టాండ్ ఎదురుగా ముందు వెళ్తున్న లారీ సడెన్ బ్రేక్ వేయడంతో విష్ణు లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. తలకు తీవ్ర గాయాలు కాగా స్థానికులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యం



పంచనామా చేస్తున్న పోలీసులు

సదాశివనగర్: మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి శివారులోని 44వ జాతీయ రహదారి పక్కన చెరుకు తోటలో గుర్తు తెలియని మహిళ మృతదేహం గురువారం లభ్యమైనట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, వయస్సు 40 నుంచి 45 సంవత్సరాల వరకు ఉంటుంటుదన్నారు. చెరుకు తోటను కౌలుకు చేస్తున్న రైతు రాజేశ్ వాసన రావడంతో గుర్తించినట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై రాజేశ్ తెలిపారు.

గజ్యానాయక్ తండా శివారులో..

మాచారెడ్డి: మండలంలోని గజ్యానాయక్ తండా శివారులో గురువారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మహిళ మృతదేహం లభ్యమైంది. ఎస్సై సంతోష్ కుమార్ తెలిపిన వివరాలు.. 35 నుంచి 40 సంవత్సరాల వయస్సు ఉన్న మహిళ శవం కుళ్లిపోయి ఉన్న దశలో గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మహిళ ఒంటిపై వంకాయ రంగు చీర, ఆకుపచ్చ రంగు జాకెట్ ఉన్నట్లు తెలిపారు.

నగరంలో వృద్ధురాలు..

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో పరిధిలోని ఖలీల్‌వాడిలో అద్దె భవనంలో ఉంటున్న గుర్తు తెలియని మహిళ (70) మృతి చెందినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు తెలిపారు. మహిళ చనిపోయి మూడు రోజులు అవుతుందని చెప్పారు. దుర్వాసన రావడంతో స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు ఘటన స్థలాన్ని పరిశీలించినట్లు పేర్కొన్నారు. కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సదరు మహిళ ఖలీల్‌వాడిలో 30 ఏళ్లుగా వివిధ హాస్పిటళ్లలో పని చేసినట్లు సమాచారం.